


# ప్రవాసాంధ్ర రచయితగా నా ప్రస్థానం

- ఆనందరావు పట్నాయక్

విదేశాంధ్రులు, ప్రవాసాంధ్రులు..వారి పిల్లలకు తెలుగు నేర్పాలి..తెలుగు బతకాలంటే ముందు తరాలకి తెలుగు భాష మధురిమల్ని అందించాలి ..ఇది ఈ తరం మాట. ఆ దిశగా జరిగే ప్రయత్నాలని కూడ మనమందరం ప్రోత్సహించాలి.. అభినందించాలి. ఐతే నాలుగైదు దశాబ్దాలక్రిందట ఆంధ్రప్రదేశ్ కి పొరుగునే ఉన్న రాష్ట్రాల్లోని తెలుగు వారు తెలుగు నేర్చుకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడేవారో తెలుసుకుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో పుట్టి పెరిగి, పట్టుదలగా తెలుగు నేర్చుకోవడమే కాకుండా మంచి రచయితగా కూడా పేరుతెచ్చుకున్న శ్రీ ఆనందరావు పట్నాయక్ గారు తన ప్రవాసాంధ్ర జీవితంలోని కొన్ని సంఘటనల్ని ఈ నెల 'కౌముది' పాఠకులతో పంచుకుంటున్నారు.



బ్రిటిషు పాలనలో మద్రాసు ప్రెసిడెన్సీ చాలా విశాలమైన రాష్ట్రం. జైపూర్, పర్లాకిమిడి సంస్థానలను కలుపుకుని 1936వ సంవత్సరం ఒరిస్సా రాష్ట్రం అవతరించింది. భాషా ప్రాతిపదిక మీద 1952వ సంవత్సరంలో ఏర్పడ్డ ఆంధ్ర రాష్ట్రం అప్పటి గానీ ఉండి ఉంటే ఈ రెండు చేయిజారిపోయుండేవి కావు.

ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకి పదిహేనుమైళ్ళ దూరంలో ఉండే రాయగడ పట్టణంలో 1947 వ సంవత్సరంలో ఆగస్టు పన్నెండోతేదీన నేను పుట్టాను. మరో మూడు రోజుల తరువాత దేశానికి అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది. ఇంకా తెల్లవారలేదు.

బొబ్బిలి దగ్గర ఉండే సీతానగరం వద్ద ఉండే ఊరిని, ఆస్తిని, అప్పుల్ని వదిలేసి మానాన్నగారు మా ఊరొచ్చేశారు. కారణం మా అమ్మ జన్మభూమి రాయగడ. ఈ రెండూ నాకు స్వర్గధామమే. విశాఖపట్టణం, రామ్‌పూర్ నగరాలను కలుపుతూ మా ఊరి మీదుగా రైల్వే లైను పోతుంది. అందులో పనిచేసిన వాళ్ళలో తొంభై శాతం తెలుగువాళ్ళు. రైల్వే స్కూలులో మూడవతరగతి వరకు చదివాను.

ఆ తర్వాత గోవిందబంద్రదేకి హైస్కూలులో చేరాను. జయపూర్ మహారాజు పేరిట 1947 వ సంవత్సరంలో వెలిసింది స్కూలు. బైలింగ్వులకి స్కూలు. తెలుగు, ఒరియా భాషలు బోధించడానికి ఏర్పరచిన స్కూలది. కానీ మాకు తెలుగు పుస్తకాలుండేవి కావు. తెలుగు టీచర్లు చాలా తక్కువ.

ఒరియా టీచర్లు బోధిస్తే, ఇంగ్లీష్ పుస్తకాలు చదివి, తెలుగులో పరిక్ష రాసేవాళ్ళం. మేమంతా సవతల్లి పిల్లలం. మాకు స్కాలర్‌షిప్ వచ్చేదికాదు. కారణం మాకక్కడ స్థిరాస్థిలేదు, మా తండ్రికి ఒరియా భాష రాదు.

ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే ప్రవాసాంధ్రులు విశ్వమంతటా ఉన్నారు. ఆంధ్రదేశానికి పొరుగునే ఉన్న ఒరిస్సాలోని ప్రవాసాంధ్రుల అస్తిత్వం పాఠకులకు తెలియచెప్పాలని నా ప్రయత్నం.

మేం పదవతరగతి చదువుకునే రోజుల్లో మా సైన్సు మాష్టారుగారు పంతుల శ్రీరామశాస్త్రిగారని ఉండేవారు. ఆయన కథలు అడపా, దడపా ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వీక్లీలో పడుతుండేవి. ఈ విషయం తోటి విద్యార్థులలో చర్చనీయాంశంగా ఉండేది. పత్రికల్లో పేరు పడడం అంత గొప్పగా ఉండేది. అలా మొదటిసారి రచయితనవ్వాలన్న కోర్కె బలీయంగా నా మనస్సులో చోటు చేసుకుంది.

చిత్రగుప్త పక్షపత్రిక వస్తుండేది. బాలకవి పాత్రో అందులో క్విజ్ నిర్వహించేవారు. మా ఊర్లో బర్మాషెల్ కంపెనీలో పనిచేసే పంతులుగారు ఆ క్విజ్‌లో పాల్గొని విజేతగా నెగ్గడంతో అతని ఫోటో, బ్లాక్ అండ్ వైట్ వేసారు. అంటే పత్రికల్లో పేరుతో పాటు మన ఫోటో కూడా చూసుకోవచ్చన్నది రెండవ అంకురం బీజమెత్తింది.




మా ఇంటికి ఆంధ్రపత్రిక వారపత్రిక వచ్చేది. దాని ఖరీదు పావల. మద్రాసు నుండి వెలువడేది. దీపావళి, సంక్రాంతికి వచ్చే ప్రత్యేక సంచికలు పెద్ద ఆకర్షణ. ప్రచారం కోసం కునేగా మరి కొళుందు అనే సెంటు పత్రికలకి రాసి వదిలేవారు. ఆ వాసనకి, పత్రికల్లోని కార్టూనులు, జోకలకు ముగ్ధులమయిపోయేవాళ్ళం. పండుగలు, పబ్బాలకు మా అక్కా, బావ వచ్చినప్పుడు యువ, జ్యోతి మాసపత్రికలు తెచ్చేవారు. అందరూ పడుకున్న తర్వాత అవి నాకు చేతికి చిక్కేవి. లైటు వేసుకుని చదివితే డిస్టబెన్సు. దుప్పటి ముసుగు వేసుకుని టార్చిలైటు వెలుగులో చదివి పొందిన ఆనందం మరి దేనికీ సాటిరాదు.

మా ఇంటికి దగ్గర్లోనే గరిమెళ్ళ వారి కుటుంబం ఉండేది. వాళ్ళింటికి చందమామ, బాలమిత్ర, చంటి పిల్లల పత్రికలు వచ్చేవి. అవి అక్కడే చదివి ఇచ్చేయాలి. ఆబగా, ఆత్రుతగా చదివి ఔపోసన పట్టేవాడిని. ఇప్పటికీ జాతక కథలు, బొమ్మల రామాయణం సీరియల్స్ నా మెదడు పొరల్లో నిక్షిప్తమయి ఉన్నాయంటే నమ్మండి. చందమామలో బొమ్మ ఇచ్చి వాక్య రాస్తే పదిరూపాయల పారితోషకం ఉండేది. ముక్కాణి పెట్టి కార్డు కొనడానికి వీలులేని పరిస్థితులప్పుడు.

మా ఇంటికి మైలున్నర దూరాన రైల్వే ఇనిస్టిట్యూట్ ఉండేది. రైలు పట్టాలు దాటుకొని వెళ్ళి రోజూ మూడు గంటలపాటు అన్ని పత్రికలు దినపత్రికలతో సహా ప్రింటింగు, పబ్లిషింగు పేరుతో పాటు చదివేవాడిని. ఆ తృష్ణ తీరనిది. కనబడ్డ కాగితాన్ని, పుస్తకాన్ని వదిలేవాడిని కాను. ఒకరోజు చలంగారి మైదానం నవల చదువుతున్నానో లేదో మా అక్కయ్య చూసి కసురుకుని పుస్తకాన్ని లాక్కుని దాచేసింది. చలం పుస్తకాలు ఎందుకు చదవకూడదన్న జిజ్ఞాస మనస్సులో మొక్కై, మానై, మహావృక్షమయింది. ఏది వద్దంటారో అదే చెయ్యాలన్నది మానవనైజం. నేను మానవుడిని మరి.

అప్పుడు రాఘవయ్యగారి సంపాదకత్వంలో వెలువడే జ్యోతి మాసపత్రికలో లబ్ధప్రతిష్టులైన రచయితలు కనపడుతుండేవారు ముఖ్యంగా సినీకవులు శ్రీశ్రీ ఆరుద్ర, దాశరథి, సినారె ఒకరి మీదొకరు విమర్శనాత్మకాస్త్రాలు వదులుకునేవారు. రాబోయే సంచికలో ఎవరి మీద బురద చల్లుతారో ఆతృతగా ఎదురు చూసే రోజులుండేవి.

కేవలం పత్రికలు చదివేస్తే కాదు భాష మీద కూడా పట్టు సాధించాలి కదా. నెత్తిమీద కురచగా వెంట్రుకలుంచి, మధ్య పిలక ఊగుతుంటే, ఖద్దరు ధరించి ఆరడుగుల ఆజానుబాహువు మా తెలుగు మాష్టారుగారు. ఆయన దగ్గర వ్యాకరణం నేర్చుకున్న సమయంలో ఒక సంఘటన జరిగింది. 'మా ఊర్లో అనుకుంటున్నారు' అనే శీర్షిక చిత్రగుప్త పక్షపత్రికలో కొనసాగుతుండేది. ఎక్కడైనా ఏ

ఊర్లోనైనా అక్రమాలు జరిగాయని ఉప్పు అందితే సున్నితంగా చురక అంటించేది ఆ పత్రిక. మా తెలుగు పండితులు వారి భాగోతం ఒకటి బయటపడి పత్రికలో పడడం, ఇది మీ శిష్యుడు చేసిన నిర్వాకం అని గిట్టనివారు చెప్పడం, ఆయన నాకు బద్ధ శత్రువుగా మారడం జరిగింది. కొద్ది రోజులకే ఆయన శిష్యుడు ఎం.సుబ్బారావుగారు టెంపరరీగా మా స్కూల్లో చేరడం, ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో కాస్త తెలుగు నేర్చుకున్నాను. నాడు సుబ్బారావు మాష్టారుగారు పెట్టిన బిక్ష నేడు నా కలాన్ని పదునెక్కించి పరుగులు తీస్తుంది.

ఆ రోజుల్లో మా ఊర్లో స్టేట్ బ్యాంకు లేకుండేది. మా నాన్నగారు వాళ్ళ కంట్రాక్టర్ ఇచ్చిన చెక్ తీసుకుని ప్రతీ శనివారం విజయనగరం వెళ్ళి డబ్బు విత్‌డ్రా చేసుకుని వచ్చేవారు. పనయిన తరువాత ట్రైను రావడానికి మూడు గంటల సమయముండేది. అప్పుడాయన కాలక్షేపానికి సినిమా చూసివచ్చేవారు.



'ధరణికి గిరి భారమా!
గిరికి తరువు భారమా!
తరువుకి కాయ భారమా!
కనిపించే తల్లికి బిడ్డ భారమా!'

అన్న గేయాన్ని వినిపించి దాని అర్థం చెప్పారు. తెలుగు భాష తీయదనం మొదటిసారి రుచి చూసాను. ఆ మాదకత మస్తిష్కంలో చేరి నన్ను ఉన్నత్తుడిని చేసింది ఇప్పటికీ.

బజారు వీధిలోని ఒక లైబ్రరీకి నన్ను అసిస్టెంటు సెక్రటరీగా ఎన్నుకున్నారు. కొత్త బిచ్చగాడినయ్యాను. పొద్దులు తెలియకుండా చదువు... చదువు... చదువు... నాకో కల్పతరువు. కొమ్మూరి, టెంపోరావ్, భగవాన్, జంపన డిటెక్టివ్ సాహిత్యం నుండీ ప్రబంధాలు, జీవిత చరిత్రలు, ఆత్మకథలు... ఒకటేమిటి వందలు, వందలు పుస్తకాలు చదివను. చివరికి శృంగార పత్రికలు కూడా వదల్లేదు.

'మీ ఊర్లో వ్యభిచారం' అన్న విషయం మీద రాసి పంపిస్తే మంచి పారితోషకం ఉంటుందన్న ప్రకటన చూసి 'రమణి' మాసపత్రికకు రాసాను. అంతవరకు చదివి, చదివి ఊర్కోక ఏదో రాసి రచయిత అయిపోవాలన్న దుగ్ధ, ఆ విషయం మీద అవగాహన లేకపోయినా రాసేట్టు చేసింది. మామిడి చెట్టు పైకి రాయివేసాను. పడితే రాయి పడుతుంది లేకపోతే లేదు అన్నట్లు అప్పటికి ఆ విషయం మరచిపోయాను.

1968 వ సంవత్సరంలో నా వ్యాసంని గేయ రూపంలో మార్చి వేసారు. ఎవరికి వారు ఇది మా మీద రాసాడా అన్నట్లు భుజాలు తడుముకున్నారు. నా మిత్రుల్లో గుర్తింపు వచ్చింది దానితో పాటు ఐదురూపాయల మనియార్డరుకూడా వచ్చింది పత్రికనుండి. పేరుకి పేరు డబ్బుకి డబ్బు కూడ బలుక్కుని మనింట తలుపు తడితే ఈ హాబీని ఎవరు వదులుకుంటారు చెప్పండి. అలా మొదలయింది నా రచనా వ్యాసంగం.

అప్పుడు ఒరిస్సాలో భవానీ పాట్నాలో పనిచేస్తున్న అవసరాల రామకృష్ణరావు, విశాఖలో ఆంధ్రాయూనివర్శిటీ స్టేజి డైరెక్టరు కె.వెంకటేశ్వరరావు తదితరులిని మా కాలేజి ఫంక్షనుకి ముఖ్య అతిథులుగా పిలవడం జరిగింది. విద్యార్థులు వాళ్ళకు బ్రహ్మ రథం పట్టారు. కవులకు కనకాభిషేకం, కాలికి గండపెండేరం తొడగడం విన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూసాను. అందుకే రచయితగా ఎదగాలన్న తపన శాఖోపశాఖలుగా పెరిగింది.

ఉద్యోగ పర్వంలో ఊళ్ళేలుతూ 1977 వ సంవత్సరంలో మా ఊరు బదిలీ అయి రావడం జరిగింది. అక్కడ అప్పుడే ఆవిర్భించిన ప్రగతి సాహితీ సాంస్కృతిక సంస్థలో సభ్యుడిగా చేరాను. ప్రతీవారం సమావేశాలు జరిగేవి. సభ్యులు తాము రాసుకు వచ్చిన కథలు, కవితలు, వ్యాసాలు చదివి వినిపించేవారు. వాటిని మిత్రులు జ్యోత్స్న, కె.ఎల్.ప్రసాదు విశ్లేషణ జరిపిన తర్వాత పత్రికలకి పంపేవాడిని. బరంపురం నుండి స్పృహ సంచిక వెలువడుతుండేది. నా కథలు వేసుకునేవారు. ఆ ఉద్యమం అక్కడితో ఆగలేదు. ఆంధ్రదేశంలోని అన్నీ ప్రముఖ పత్రికలకు విసుగు చెందని విక్రమార్కుడిలా రచనలు పంపుతుండేవాడిని.

ప్రగతి సంస్థ వార్షికోత్సవాలకు శ్రీశ్రీ, ఆరుద్ర, సినారె, లత, శివారెడ్డి, కోడూరి శ్రీరామమూర్తిలాంటి ప్రముఖులను రప్పించడం, వాళ్ళతో సాహితీకాలక్షేపం చేస్తుండేవాళ్ళం. పప్పు వేణుగోపాలరావు అష్టావధానం భాషలోని కొత్త అందాల అంచులను చూపెట్టింది. శ్రీకాకుళం నుండీ నడిచొచ్చేకథ కాళీపట్నం రామారావు, ప్రజాకవి వంగపండు ప్రసాద్, చలసాని ప్రసాద్ లాంటి ప్రముఖులు రావడం, ప్రజా సాహితీ గేయాలు వినడంతో మా పెను నిద్ర వదిలింది.

1979 వ సంవత్సరంలో బరంపురంలో అఖిల భారత తెలుగు రచయితల సమ్మేళానికి జ్వాలాముఖి, చెరబండరాజు లాంటి దిగంబర కవులు, బలివాడ కాంతారావు, వాకాటి పాండురంగారావు, మంథా వెంకట రమణారావు లాంటి కథకులు, కడియాల రామ్మోహనరాయ్ లాంటి విమర్శకులు, స్థానికంగా ఉండే ఉప్పల లక్ష్మణరావు లాంటి సాహితి వేత్తలు రావడం, వాళ్ళందరినీ ఒకే వేదిక మీద చూడగలిగే అదృష్టం కలిగింది.

మా విడిదిలో యువకులం కూచుని ఆధునిక కవిత్వం, దాని పోకడల మీద మాట్లాడుకుంటున్నాం. చిటికెన వేలు, రింగ్ ఫింగర్‌కి మధ్య సిగరెట్ బిగించి, దానితో రెండు పెగ్గులు లాగించి వచ్చారండి మహాకవి. మా ఉత్సాహానికి అంతులేదు. కవితలు చదివి వినిపించాం. వెళుతూ వెళుతూ శ్రీశ్రీ ఒకే మాట అన్నారు. ఇక నేను పోయినా ఫర్వాలేదు, నాలోటుని భర్తీ చేసే యువత నా అడుగుల్లో అడుగులు వేసుకుని వస్తున్నారు. ఆనాటి సంఘటనతో విస్తృతంగా రచనలు చేయాలన్న కోర్కె బలీయమయింది. ఎక్కడైనా సాహితీ సభ జరిగితే హాజరయి అక్కడికి వచ్చిన రచయితలని కలిసి వాళ్ళ అనుభవాలు, భావాలు పంచుకోవడం జీవితంలో ఒక భాగమయిపోయింది.

ప్రవాసాంధ్ర రచయితలైన మంధా, భట్టిప్రోలు కృష్ణమూర్తి, అవసరాలవారు, వసుంధర, ఉపద్రష్ట అనురాధ, తుర్లపాటి రాజేశ్వరి లాంటి అతిరథమహారథులతో నాకు ప్రత్యక్షంగా సంబంధ బాంధవ్యాలుండేవి. వారి దగ్గరి నుండి రచనా మెళుకువలెన్నో, నేర్చుకున్నాను. విశాఖపట్టణం, హైదరాబాదు, బొంబాయి, బెంగుళూరులో జరిగిన ప్రపంచ సభలకు హాజరవ్వడంతో పాటు తిరుపతిలో ప్రతి ఏటా జరిగే సాహితీ బ్రహ్మోత్సవాలకి హాజరవ్వడం ఒక ఉపన్యాసంతో జ్ఞానార్జన చేసుకోవచ్చన్నది నా ప్రగాఢ విశ్వాసం.

తెలుగునాట తెలుగురచయితగా పుట్టడమే మన దురదృష్టం. కొంతమంది ప్రతి పత్రికాధిపతులు మన కథలు వేసుకుని పారితోషకం ఇవ్వకపోగా కనీసం కాంప్లిమెంటరీ కాపీ కూడా పంపరు. ఔత్సాహిక రచయితలకు ఇది ఒక గొడ్డలిపెట్టు. అయితే, నాణేనికి అటువైపు చూడాలి శ్రీమతి ఏ.ఎస్ లక్ష్మి (ఆంధ్రభూమి వీక్లీ, మంత్లీ) రాజగోపాల్ (చినుకు), చతుర, విపుల పత్రికల సంపాదకులు కొత్త కలాలని ప్రోత్సహించడం ముదావహం.

1994 వ సంవత్సరంలో మళ్ళీ రాయగడ వచ్చాను. అంతవరకు హైబర్ నేషన్‌లో ఉన్న నాకు మరలా ఉత్సాహం ఉరకలు వేయసాగింది. కానీ ప్రగతి చచ్చిపోయింది. కొద్ది నెలలు ఆగి సాహితీ మిత్రులని పోగుచేసుకుని స్పందన సాహితీ సంస్కృతి సంస్థ స్థాపించాను ప్రప్రథమ సెక్రటీరీగా లాలపోసి జోలపాడి నిలబెట్టడం జరిగింది ఒక సాహితీ సంథ అదీ ఒక ప్రవాసాంధ్రలో బ్రతికించడం కత్తిమీద సాములాంటిది.




సంస్థ సమావేశాలకు ముద్దం శెట్టి హనుమంతరావ్, అడపా రామకృష్ణ, బులుసు.జె.ప్రకాష్, పొన్నాడ కుమార్, సింగిశెట్టి సంజీవరావు, కారా మాష్టారు తదితరులను పిలిచి సన్మానం చేసాం. ఆ సభలకు ఏగుదెంచిన సాహితీ ప్రియులిని చూసి అతిధులు ఆశ్చర్యపోయేవారు. **దట్ ఈజ్ ప్రవాసాంధ్ర!**

రెండువందల పైగా కథలు, వ్యాసాలు, కవితలు రాసాను. ఆశ్రయ, మొగలిపూల తోటమాలి, యు.ఎస్.ట్రావెలాగు నవలలు త్వరలో రాబోతున్నాయి. వీటికి ప్రేరణ వర్జీనియాలో ఉన్న మా అమ్మాయి నౌరీస్, అల్లుడు రవిబాబు. మా అబ్బాయి క్రాంతికుమార్ ఆర్ధిక సహాయంతో నా కథా సంపుటాలు అమూల్యకానుక, గురుదక్షిణ వెలుగు చూసాయి. శ్రీమతి ఇందిర నా కథలకు మొదటి శ్రోత. అలానే కథల రెమ్యునరేషన్ సంగ్రహించడం మహాప్రీతి. గ్రిడ్ కార్పోరేషను ఆఫ్ ఒరిస్సాలో మ్యానేజరు ఫైనాన్స్‌గా పని చేసి 2004 వ సంవత్సరంలో పదవీ విరమణ చేసాను.

నా జన్మ రాయగడలో స్పందన సంస్థ చేసిన సన్మానం, విద్యలా నగరం విజయనగరంలో విజయభావన సంస్థ జరిపిన సత్కారం, శ్రీకాకుళంలోని కథానిలయంలో కారా మాష్టారి చేతుల మీదుగా నా పుస్తకావిష్కరణ... కొన్ని మరచిపోలేని మధురస్మృతులు 30 - 12- 2007 నాడు డిడి. 8 సప్తగిరి ఛానెల్‌లో ప్రవాసాంధ్ర రచయితగా ఇంటర్వ్యూ లైవ్ టెలికాస్ట్ నా బతుకు పుస్తకంలో ఓ మరచిపోలేని మంచి పుట.

జాతీయ స్థాయిలో ఆంధ్ర విజ్ఞాన మిత్రమండలి, బరంపురం నిర్వహించిన కథల పోటీలో నా కథ 'నైతికానైతికం' ప్రథమ బహుమతి, ఆటా 2008 నిర్వహించిన అంతర్జాతీయ కథల పోటీలో నా కథ 'కొమ్ముదువ్వెన' ద్వితీయ బహుమతి పొందడం నా కీర్తికిరీటంలో కలికితురాయి.

ఖండాలు దాటి, సప్తసముద్రాలు లంఘించి, దేశం కాని దేశంలో స్వలాభాపేక్షకు ఆశించకుండా కౌముది వెబ్‌పత్రికను నడిపి విశ్వమంతటా విజయబావుటా ఎగరవేస్తున్న ప్రవాస భారతీయులు, తెలుగు కళామ తల్లి ఋణం తీర్చుకుంటున్న కిరణ్‌ప్రభ దంపతులకు స్వదేశీ ప్రవాసాంధ్రుల తరపున హార్దిక అభివందనలు.

✡✡✡